

## కుంగిన క్యాతన్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి

- వాహనదారుల్లో భయాందోళన

శెనార్తి మీడియా, రామకృష్ణాపూర్:మంచిర్యాల జిల్లా మందమరి మండలం క్యాతన్‌పల్లిలో ఇటీవల నిర్మించిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి రోడ్డు సోమవారం రాత్రి కుంగిపోయింది. రామకృష్ణాపూర్ నుంచి మంచిర్యాల వైపుకు వెళ్లే ప్రధాన మార్గంలో ఉన్న ఈ వంతెన ప్రమాదకరంగా మారినట్టు వాహనదారులు చెబుతున్నారు. ఫుట్‌పాత్‌పై పగుళ్లు కూడా ఏర్పడ్డాయి.అర్ధరాత్రి సమయంలో వాహనాల రాకపోకల మధ్య ఈ దెబ్బతిన్న రోడ్డు గుర్తించబడింది. కాంట్రాక్టర్లు పనుల్లో నాణ్యత పాటించకపోవడం, అధికారులు పర్యవేక్షనలో నిర్లక్ష్యం వహించడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.ప్రజల ప్రాణాలను లెక్కచేయకుండా నిర్మాణ పనులను అలసత్వంగా నిర్వహించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి చర్యలు

- ప్రజల విన్నపాలపై అధికారులతో సమన్వయం

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రయ్య చెప్పారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.జన్నారం, దండేపల్లి మండలాల నుంచి వచ్చిన ప్రజలు లక్షెట్టిపేట, జన్నారం మీదుగా నిర్మల్, ఆదిలాబాద్‌కు వెళ్లే రాష్ట్ర రహదారులపై అటవీ శాఖ విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ విజ్ఞప్తి చేశారు. ఈ నిషేధం వల్ల అభివృద్ధి పనులు అంతరాయమవుతున్నాయని వివరించారు.కన్నేపల్లి, ముత్తాపూర్, అంకన్నపేట శివార్లలో సీలింగ్, అసైన్డ్, ఇనాం భూములు ఎక్కువగా ఆక్రమించి వాడుతున్న వారి భూములను కొలిపించి, నిరుపేదలకు జీవనాధారం కల్పించాలని స్థానికులు కోరారు.బెల్లంపల్లి టేకుల బస్తీకి చెందిన తోట పోచన్న తన భూమిలో వేరొకరు తప్పుడు సమాచారం ఆధారంగా ఇంటి నెంబరు పొంది పట్టా పొందారని వాపోయారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.కాంబోజిపేట శివారులో ఉన్న భూమి అక్రమంగా ఇతరుల పేరుపై పట్టా అయినట్లు చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన బొమ్మ శ్రీనివాస్ ఆరోపించారు. తండ్రి పేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసత్ పట్టా చేయాలని కోరారు.ధర్మరావుపేట గ్రామానికి చెందిన ముక్కిడి మల్లయ్య, ఏనుగు జనార్ధన్ రెడ్డి రాళ్లవాగు ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భూములు పోయినట్లు తెలిపారు. నష్ట పరిహారం ఇవ్వాలని విన్నవించారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన రాదండి లావణ్య చెన్నూర్ శివారులో తన భూమిలో అక్రమ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్మరావుపేట గ్రామస్తులు ఊర చెరువులో చేపల పెంపకం కోసం వేలం పాట నిర్వహించాలని కోరారు.పెద్దపల్లి జిల్లాకు చెందిన మొహమ్మద్ నిక్షత్ తబస్సుమ్ తన రేషన్ కార్డు బదిలీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అదనపు కలెక్టర్ చంద్రయ్య, మొత్తం 72 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



- ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, ఇండ్ల నిర్మాణాలపై పరిశీలన
- సమయపాలన పాటించని సిబ్బందిపై హెచ్చరిక
- విద్యార్థుల అభిప్రాయాలు సేకరించిన అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**శెనార్తి మీడియా, మంచిర్యాల (ఆసిఫాబాద్)**

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి తెలిపారు. సోమవారం ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా అడ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, జనకాపూర్ మండల పరిషత్ పాఠశాల, ఆర్.ఆర్. కాలనీ, యు.ఆర్.ఎస్.ఆర్.ఆర్. కాలనీల్లో ఏర్పాట్లు పరిశీలించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ తీరులో ఎలాంటి అలసత్వం ఉండకూడదని తెలిపారు. హాజరు రిజిస్టర్ పరిశీలించిన ఆయన, సిబ్బంది సమయపాలన పాటించాల్సిన అవసరం ఉందన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశిస్తూ, ఇసుక ఉచితంగా అందుబాటులో ఉందని లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మధ్యాహ్న భోజనంలో పోషకాహారంతో కూడిన ఆహారం ఇవ్వాలన్నారు. తాగునీరు శుద్ధంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, బోధనపై అభిప్రాయాలు సేకరించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వర్షపు నీరు నిలువకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి

**శెనార్తి మీడియా, కరీంనగర్ :** నగరంలో వర్షపు నీరు నిలువకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నగరంలో పర్యటించి ఇటీవల వరద నీరు నిలిచిన ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, డ్రైనేజీలో చెత్త చెదారంతోపాటు పేరుకుపోయిన సిల్టు తొలగించాలన్నారు. నగరపాలక సంస్థ, ఆర్‌అండ్‌బీ అధికారుల సమన్వయంతో వరదనీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజి వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఈఈ యాదగిరి, డీఈ లచ్చిరెడ్డి, ఏసీపీ శ్రీధర్, డీఆర్ఎఫ్, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది చర్యలు చేపడుతూ క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. గంగాధరలో ఎరువుల దుకాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణంలో కొనుగోళ్ల రిజిస్టర్, ఎరువుల నిల్వలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యవసాయ విస్తరణ అధికారులు దుకాణాల వారీగా నిఘా ఉంచాలని, నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇంటింటి ఆరోగ్య సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, క్యాంపులు ఏర్పాటు చేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని రకాల మందులను స్టాక్ ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యేక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, జిల్లా వ్యవసాధికారి భాగ్యలక్ష్మి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో రాము, వైద్యాధికారి శ్వేత పాల్గొన్నారు.

## నూతన గ్రంథాలయ భవనం మంజూరు చేయిస్తా

- చైర్మన్ మల్లెపూల నరసయ్య

**శెనార్తి మీడియా, తలమడుగు**

తలమడుగు మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సోమవారం గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనను సన్మానించారు. ప్రస్తుతం గ్రంథాలయం యూత్ బిల్డింగ్‌లో కొనసాగుతుండటంతో, ప్రత్యేక భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మల్లెపూల నరసయ్య మాట్లాడుతూ, మండలానికి నూతన గ్రంథాలయ భవనాన్ని మంజూరు చేయిస్తానన్నారు. యువత విద్యలో పురోగమించి ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి గోక గణేష్ రెడ్డి, బాబన్న, రాజేశ్వర్, సొసైటీ వైస్ చైర్మన్ పద్మాకర్ రెడ్డి, వెంకన్న యాదవ్, సాంబశివ, ప్రవీణ్ రెడ్డి, రవికాంత్ యాదవ్, అభిరామిరెడ్డి, రామ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.




# రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా..?

**ప్రజలకు తప్పని తిప్పలు..**

**పట్టించుకోని అధికారులు..**

గ్రామాలను కలిపే అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారుతున్నాయి. అడుగుకో గుంత ఉండడంతో రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని కేశవపట్నం నుండి వీణవంకకు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. కన్నాపూర్ రాజాపూర్ మధ్యలో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. దీంతో ఈ దారి గుండా వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు

- శెనార్తి మీడియా, శంకరపట్నం



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డీఎంహెచ్ఓ పరిశీలన

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు గుండి, రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి పలు అంశాలను పరిశీలించారు.వైద్యాధికారులు అటెండెన్స్ రిజిస్టర్లు, అవుట్ పేషెంట్ రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలించారు. కేంద్రాల పరిశుభ్రతను తనిఖీ చేసి ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎన్‌సీడీ క్లినిక్ రికార్డులను పరిశీలించిన అధికారులు, అధిక రక్తపోటు, షుగర్ వంటి అసంక్రమిత వ్యాధుల వివరాలను సమీక్షించారు. ఈ వ్యాధులకు సంబంధించి అందుతున్న మందులు ప్రతి బాధితుడికి ఉచితంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. లేబొరేటరీలు, ఫార్మసీ స్టోర్లలో సీజనల్ వ్యాధుల మందుల నిల్వలను పరిశీలించారు.మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటూ, హెల్త్ క్యాంపుల ద్వారా రీ–స్క్రీనింగ్ చేపట్టాలని సూచించారు. ఆపరేషన్ థియేటర్, ప్రసూతి గదులను పరిశీలించి, అవసరమైన అత్యవసర మందుల



ప్రస్తుత నిల్వలపై సమీక్ష జరిపారు.మొదటి కాన్పు నుంచే సిజేరియన్ చేయించుకోవడం వల్ల కలిగే సమస్యలను వివరించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. గర్భిణులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకూ అవగాహన కల్పించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన సందర్భంగా అక్కడికి వచ్చిన పేషంట్లతో మాట్లాడి, అందుతున్న వైద్యసేవలపై సమాచారాన్ని సేకరించారు.ఈ కార్యక్రమంలో గుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గ్రీష్మాన్య, డీపీఓ ఎన్‌హెచ్‌ఎం స్వామి, మలేరియా సబ్ యూనిట్ అధికారి రామనాథం, ఆయా కేంద్రాల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణికి 328 దరఖాస్తులు

**శెనార్తి మీడియా, కరీంనగర్ :** కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 328 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించారు. అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు మహేశ్వర్, రమేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను విని వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను సంబంధిత సెక్షన్ అధికారులు సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు.

### ఫిడే మహిళల ప్రపంచకప్ విజేతగా

# దివ్య దేశ్‌ముఖ్

## ఫైనల్లో కోనేరు హంపి ఓటమి

ప్రపంచ మహిళల చెస్ చాంపియన్ గా దివ్య దేశ్ ముఖ్ విజయం సాధించారు. టైబ్రేక్ కు దారి తీసిన ఫైనల్లో దివ్య .. కోనేరు హంపీని ఓడించారు. దివ్య దేశ్ ముఖ్ వయసు 19 ఏళ్లు మాత్రమే. చిన్న వయసులోనే ప్రపంచ కప్ టైటిల్ సాధించి రికార్డు సృష్టించారు. ఫైన్‌లో హంపి తీవ్రంగా పోరాడింది, కానీ దివ్య దేశ్‌ముఖ్ తన కొత్త తరహా ఆటతో హంపీని ఓడించింది. ఫైనల్‌లో గెలవడం ద్వారా దివ్య గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను డైరెక్ట్ గా సాధించేసినట్లయింది. గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను సాధించడానికి, ఒక ఆటగాడు మూడు GM నార్మ్‌లను, 2500 రేటింగ్‌ను సాధించాలి. దివ్య ఫిడే మహిళల వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా డైరక్ట్ టైటిల్ సాధించారు.ఇది ఆమెను కొనేరు హంపీ, హరిక ద్రోణవల్లి, ఆర్. వైశాలి తర్వాత భారతదేశం నాల్గవ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచేలా చేస్తుంది. ఫిడే నిబంధనల ప్రకారం మూడు నార్మ్‌లు , 2500 రేటింగ్ అవసరాన్ని దాటవేస్తుంది. దివ్య ఆక్రమణాత్మక , టాక్టికల్ చెస్ ఆడటంలో మంచి నైపుణ్యం సాధించారు. 19 సంవత్సరాల వయస్సులో, దివ్య తన ఆటలో అసాధారణమైన పరిపక్వతను ప్రదర్శిస్తున్నారని చెస్ ప్లేయర్లు ప్రశంసిస్తున్నారు.

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ కు చెందిన దివ్యా దేశ్ ముఖ్ 2021లో భారతదేశం 21వ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచారు. ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్‌ను గతంలోనే పొందారు. 2025 ఫిడే మహిళల వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరుకోవడం ద్వారా ఆమె మొదటి గ్రాండ్‌మాస్టర్ నార్మ్‌ను సాధించింది. ఇప్పుడు టైటిల్ కూడా సాధించి తిరుగులేని భవిష్యత్ ఉందని నిరూపించింది. దివ్య దేశ్‌ముఖ్ అనేక అంతర్జాతీయ జాతీయ టోర్నమెంట్లలో అద్భుతమైన ప్రతిభ చూపింది. జూన్ 2024లో, దివ్య 18 సంవత్సరాల వయస్సులో వరల్డ్ జూనియర్ గర్ల్స్ టైటిల్‌ను గెలుచుకుంది, కొనేరు హంపీ (2001), హరిక ద్రోణవల్లి (2008), సౌమ్య స్వామినాథన్ (2009) తర్వాత ఈ టైటిల్ గెలిచిన నాల్గవ భారతీయ చెస్ ప్లేయర్ గా నిలిచారు. కోనేరు హంపితో పోలిస్తే దివ్య దేశ్‌ముఖ్ పెద్దగా అనుభవం లేని క్రీడాకారిణి. నాగపుర్‌కు చెందిన దివ్య, సీనియర్ విభాగంలో ఆడిన టోర్నీలు కూడా తక్కువగానే ఉన్నాయి. ఈ టోర్నీ ఫైనల్స్ ముందు వరకు గ్రాండ్‌మాస్టర్ హోదా కూడా అందుకోలేదు. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను పొందింది దివ్య. ఆ తర్వాత 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఒలింపియాడ్‌లో మూడు పసిడి పతకాలు కూడా దివ్య ఖాతాలో ఉన్నాయి. గతేడాది తొలిసారి 2500 ఎలో రేటింగ్‌ను అందుకుంది. దూకుడైన ఆటతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతినిపిస్తోంది. తాజాగా ప్రపంచకప్‌లో తనకన్నా మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక (క్వార్టర్‌ఫైనల్), జు జినర్ (ప్రిక్వార్టర్స్)పై నెగ్గడమే ఇందుకు ఉదాహరణ. సెమీస్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ జాగ్‌యిపై గెలవడం ఆమెను మరో మెట్టు ఎక్కించింది. ఇక మహిళల ప్రపంచ ఛాంపియన్?గా నిలిచిన దివ్య దేశ్?ముఖ్?ను విశ్వనాథన్ ఆనంద్ అభినందిస్తూ ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఇది ఉక్కంఠ భరితమైన పోరుని, కోనేరు హంపి కూడా మంచి ఆటతీరు పోరాటస్ఫూర్తిని కనబర్చారని తెలిపారు. భారత చదరంగానికి ఇది సంబరాలను తెచ్చిన విజయం ఇది అంటూ రాసుకొచ్చారు.



# ఐదో టెస్టుపై భారత్ దృష్టి

## పలు మార్పులతో బరిలోకి దిగే అవకాశం



మాంచెస్టర్‌లో జరిగిన నాల్గవ టెస్ట్ మ్యాచ్‌లో భారత్ క్లిష్ట పరిస్థితులను అధిగమించి మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ధైర్యసాహసాలు జట్టును ఓటమి నుండి కాపాడాయి. అయితే ఈ టెస్ట్ తర్వాత భారత్ ఇప్పటికీ సిరీస్‌లో 1-2తో వెనుకబడి ఉంది. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ ఐదవ, చివరి టెస్ట్ మ్యాచ్ లండన్‌లోని ఓవల్ మైదానంలో జూలై 31 నుండి ఆగస్టు 4 వరకు జరుగుతుంది. ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లాండ్ ప్రస్తుతం 2-1తో ఆధిక్యంలో ఉంది. భారత్ ఇప్పుడు ట్రోఫీని గెలుచుకునే అవకాశం లేదు. కానీ సిరీస్‌ను డ్రా చేసుకోవడం ద్వారా గౌరవప్రదమైన పునరాగమనం చేసే అవకాశం ఖచ్చితంగా ఉందనే చెప్పవచ్చు.అయితే ఈ నిర్ణయాత్మక టెస్ట్ కు ముందు.. టీం ఇండియా గాయాలు, ఫామ్ అనే రెండు సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలోనే చివరి టెస్ట్ కోసం భారత జట్టులో కనీసం నాలుగు మార్పులు జరిగే అవకాశం ఉంది. మాంచెస్టర్ టెస్ట్ డ్రా అవ్వడం భారత్ కు ఖచ్చితంగా ఉపశమనం కలిగించిందనే చెప్పవచ్చు. కానీ ఓవల్ టెస్ట్ కోసం భారత్ సన్నాహాల్లో అతిపెద్ద అడ్డంకి ఇద్దరు కీలక ఆటగాళ్ళు రిషబ్ పంత్, జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం.మాంచెస్టర్ టెస్ట్ సందర్భంగా భారత టెస్ట్ జట్టు వైస్ కెప్టెన్, వికెట్ కీపర్ రిషబ్ పంత్ కాలి వేలుకు గాయం అయ్యింది. దీంతో అతను ఐదవ టెస్ట్‌కు దూరంగా ఉన్నాడు. అతని స్థానంలో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్‌ను ప్లేయింగ్ ఎలెవన్‌లో చేర్చే అవకాశం ఉంది. పంత్ స్థానంలో ఎన్ జగదీసన్‌ను జట్టులోకి తీసుకున్నప్పటికీ, జురెల్‌కు ఆడే అవకాశం లభించే అవకాశం ఉంది. జురెల్ కూడా ఇండియా ఎ జట్టులో సభ్యుడు, కాబట్టి అతనికి జగదీసన్ కంటే కొంచెం ఎక్కువ అనుభవం ఉంది.జట్టు ప్రధాన ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా షెడ్యూల్ ప్రకారం ఈ సిరీస్‌లో కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడాల్సి వచ్చింది.ఇప్పుడా కోటా పూర్తయింది. అతను ఓవల్ టెస్ట్‌లో ఆడకపోవడం దాదాపు ఖాయం. అయితే మ్యాచ్ తర్వాత ప్రెస్ మీట్ లో గౌతమ్ గంభీర్ తన ఆటపై సస్పెన్స్ వ్యక్తం చేశాడు. మొదటి రెండు టెస్టులు ఆడిన ఆకాశ్‌దీప్ సింగ్‌ను తిరిగి అతని స్థానంలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నాల్గవ టెస్ట్‌లో ఫిట్‌నెస్ కారణంగా అవుట్ అయ్యాడు.నాల్గవ టెస్ట్‌లో ఆకాష్‌దీప్ స్థానంలో ఆడిన అన్షుల్ కాంబోజ్ అంతగా రాణించలేదు. అతని స్పీడ్ లైన్-లెంగ్త్ నిరూత్సహా పరిచాయి. అతనికి ఫిట్‌నెస్ సమస్యలు ఉండటంతో అతన్ని తొలగించి అతని స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ అరంగేట్రం చేసే అవకాశం ఉండవచ్చు. నాల్గవ టెస్ట్‌కు ముందు అర్ష్‌దీప్ గాయపడ్డాడు. కానీ ఇప్పుడు అతను పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడు. నెట్స్‌లో బౌలింగ్ చేస్తున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ ఫిట్‌గా లేకపోతే, ప్రసిద్ధ్ కృష్ణను తీసుకునే ఛాన్స్ ఎక్కువగా ఉంది. నాల్గవ టెస్ట్‌లో శార్దూల్ ఠాకూర్‌కు ఆల్ రౌండర్‌గా అవకాశం లభించింది. కానీ అతను బౌలింగ్ లో ప్రభావం చూపలేకపోయాడు . బ్యాటింగ్‌లో అంతగా రాణించలేదు. అతని స్థానంలో అదనపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను చేర్చుకోవాలని జట్టు పరిశీలిస్తోంది. కుల్దీప్ తిరిగి రాకపోతే, కరుణ్ నాయర్ తిరిగి వచ్చే అవకాశం కూడా ఉండవచ్చు. కానీ కుల్దీప్‌కు అవకాశం వస్తే, నాయర్ బ్యాట్స్‌మన్‌గా జట్టులోకి తిరిగి వచ్చే అవకాశం లేదు. టాప్ ఆర్డర్‌లో సాయి సుదర్శన్ రెండవ ఇన్నింగ్స్‌లో డకౌట్ అయినప్పటికీ.. మొదటి ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నాడు.

**ఓవల్‌లో జరిగే 5వ టెస్ట్ కోసం**

**భారత సంభావ్య ప్లేయింగ్ 11:**

శుభమన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ఆకాశ్‌దీప్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్/ప్రసిద్ధి కృష్ణ.

# పంత్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే

### టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్



ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌ను డ్రా చేసుకోవడంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ సంతోషం వ్యక్తం చేశాడు. భారత జట్టు అద్వితీయమైన పోరాటంతోనే ఇది సాధ్యమైందని కొనియాడాడు. గాయంతో బ్యాటింగ్ చేసిన రిషభ్ పంత్‌ను ఎంత పొగిడినా తక్కువేనన్నాడు. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అజేయ శతకాలతో చెలరేగి టీమిండియాను గట్టెక్కించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గౌతం గంభీర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. తమ ఆటగాళ్ల సెంచరీల ముందు డ్రా కోసం ప్రయత్నించిన బెన్ స్టోక్స్ తీరును తప్పుబట్టాడు. 'ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం గర్వంగా ఉంది. చాలా మంది మా జట్టును తక్కువ అంచనా వేసారు. కానీ మా ఆటగాళ్లు అద్భుతమైన పోరాటంతో ఓటమి నుంచి గట్టెక్కించారు. దేశం కోసం మా ఆటగాళ్లు పోరాడుతారు. శుభ్‌మన్ గిల్ ప్రతిభపై ఎలాంటి సందేహం అవసరం లేదు. క్రికెట్ గురించి తెలియని వారికే అతనిపై సందేహాలు ఉంటాయి. శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ ఏ మాత్రం భారం కాదు. రిషభ్ పంత్ కాలికి గాయమవ్వడంతో ఆఖరి టెస్ట్‌కు దూరమయ్యాడు. విరిగిన కాలుతో బ్యాటింగ్ చేసిన రిషభ్ పంత్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే. అతని పోరాటం రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తుంది.'అని గంభీర్ తెలిపాడు.ఈ మ్యాచ్‌ను ముందుగానే డ్రా చేయాలని బెన్ స్టోక్స్ కోరడాన్ని గంభీర్ తప్పుబట్టాడు. ఇది సరైన చర్య కాదని, ఇంగ్లండ్ ఆటగాళ్లు కూడా సెంచరీలకు చేరువగా ఉంటే స్టోక్స్ డ్రాకు అంగీకరించేవాడా? అని ప్రశ్నించాడు. 'జడేజా, వాషింగ్టన్ సుందర్ అద్భుత బ్యాటింగ్‌తో సెంచరీలకు చేరువైనప్పుడు డ్రాకు ఎలా అంగీకరిస్తాం. బెన్ స్టోక్స్ అలా ఎలా అడుగుతాడు? ఇంగ్లండ్ ఆటగాళ్లే ఇలా సెంచరీకి చేరువగా ఉన్నప్పుడు అతను ఇలానే డ్రాకు ఒప్పుకునేవాడా? జడేజా, సుందర్ సెంచరీలు చేసుకోవడానికి పూర్తి అర్హులు. మేం ఎవర్నీ సంతోషపెట్టడానికి ఆడటం లేదు. జట్టు గెలుపు కోసం మాత్రమే ఆడుతున్నాం.'అని గంభీర్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి ప్రత్యేకంగా మాట్లాడకపోయినప్పటికీ.. జట్టులోని పేసర్లంతా ఫిట్‌గానే ఉన్నారని గంభీర్ స్పష్టం చేశాడు. ఆఖరి టెస్ట్‌లో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేయడమే తమ లక్ష్యమని చెప్పాడు.

## ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టుకు రిషభ్ పంత్ దూరం

మాంచెస్టర్ వేదికగా జరిగిన్న నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తూ గాయపడిన టీమ్?ఇండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఐదో టెస్టుకు దూరమయ్యాడు. ఆ విషయాన్ని బీసీసీఐ ఇటీవల అధికారికంగా ప్రకటించింది. తన కుడి కాలుకు ఫ్యాక్చర్ కావడం వల్లే ఐదో టెస్టులో పంత్ ఆడడం లేదని వెల్లడించింది. అతడి స్థానంలో తమిళనాడు వికెట్ కీపర్ బ్యాటర్ జగదీశన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపింది.అయితే నాలుగో టెస్టులో తొలి రోజు బ్యాటింగ్ చేస్తుండగా రిషభ్ గాయపడ్డాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ చేసేందుకు ప్రయత్నించగా, బంతి నేరుగా పాదానికి బలంగా తగిలింది. దీంతో స్టేడియంలోనే బాధతో పంత్ విలవిలలాడాడు. 37 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. నాలుగో టెస్ట్‌కు దూరమవుతాడని అంతా అనుకున్నారు.కానీ గాయం వేధిస్తున్నప్పటికీ రెండో రోజు బరిలోకి దిగాడు. హాఫ్ సెంచరీ (54) బాదాడు. అయితే గాయం వల్ల పంత్ కీపింగ్ చేయలేదు. అతడికి సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ధ్రువ్‌జురెల్ వికెట్? కీపింగ్ చేశాడు. నాలుగో టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా రిషభ్ బ్యాటింగ్‌కు దిగలేదు. గాయం పెద్దది కావడంతో అతడు మ్యాచ్ నుంచి వైదొలిగినట్లు బీసీసీఐ పేర్కొంది.బీసీసీఐ మెడికల్ టీమ్ పంత్ ఆరోగ్య పురోగతిని నిరంతం పర్యవేక్షిస్తూనే ఉందని కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. అతడు తొందరగా జట్టులోకి రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అయితే ఐదు టెస్ట్?కు పంత్ దూరమవ్వడంపై కోచ్ గౌతమ్ గౌంభీర్ స్పందించాడు. కాలికి గాయంతోనే పంత్ బ్యాటింగ్ చేశాడని, అతణ్ని ఎంత పొగిడినా తక్కువేనని అన్నాడు.రాబోయే తరాలు ఇలాంటి ఇన్నింగ్స్‌ల గురించి చర్చించుకుంటాయని పేర్కొన్నాడు. పంత్ మంచి ఫామ్‌లో ఉన్న సమయంలో ఇలా గాయపపడం చాలా దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. అతడు తొందరగా కోలుకొని త్వరగా జట్టులోకి చేరతాడని ఆశిస్తున్నానని, టెస్టు క్రికెట్‌లో రిషబ్ చాలా విలువైన ఆటగాడంటూ మ్యాచ్ అయ్యాక గంభీర్ మాట్లాడాడురు.కాగా, మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది. రవీంద్ర జడేజా (107లి), వాషింగ్టన్ సుందర్ (101లి) అసాధారణ ఆటతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసేలా చేసారు. అంతకుముందు శుభ్‌మన్ గిల్ (103) శతకం బాదేశాడు. కేఎల్ రాహుల్ (90) త్రుటిలో సెంచరీ చేసే అవకాశాన్ని కోల్పోయాడు. అయితే నాలుగో మ్యాచ్ డ్రాతో ప్రస్తుతం 2-1 తేడాతో ఇంగ్లాండ్ ఆధిక్యంలో ఉంది. ఐదో టెస్టు ఈనెల 31న లండన్‌లోని ఓవల్ మైదానంలో జరగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సిరీస్ 2-2 తేడాతో ముగియనుంది.


# నేనే కెప్టెన్‌గా ఉంటే బెన్ స్టోక్స్ తిక్క కుదుర్చేవాడిని

### మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం

ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆదివారం ముగిసిన నాలుగో టెస్ట్ చివర్లో బెన్ స్టోక్స్ వ్యవహరించిన తీరుపై అశ్విన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ ప్రవర్తన సరికాదని మండిపడ్డాడు. తానే టీమిండియా కెప్టెన్‌గా ఉండి ఉంటే బెన్ స్టోక్స్ తిక్క కుదుర్చేవాడినని తెలిపాడు. డ్రాకు అస్సలు ఒప్పుకోకపోయేవాడినని, ఆఖరి 15 ఓవర్లు కూడా ఆడించేవాడినని తెలిపాడు. ఈ మ్యాచ్‌లో వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా అసాధారణ ప్రదర్శనతో టీమిండియా ఓటమి నుంచి గట్టెక్కింది.అద్వితీయమైన బ్యాటింగ్‌తో రాణించిన జడేజా, సుందర్‌ల సెంచరీలను అడ్డుకోవాలనే దురుద్దేశంతో బెన్ స్టోక్స్ నిర్ణీత సమయం కన్నా ముందే డ్రాకు ప్రతిపాదించాడు. అయితే ఈ విజ్ఞప్తికి భారత ఆటగాళ్లు నిరాకరించారు. దాంతో సహనం కోల్పోయిన బెన్ స్టోక్స్.. భారత ఆటగాళ్లను అవమానపర్చేలా మాట్లాడాడు. హ్యారీ బ్రూక్, బెన్ డకెట్ బౌలింగ్‌లో సెంచరీలు చేస్తారా? అని హేళన చేశాడు. ఈ మాటలు స్టంప్ మైక్‌లో రికార్డ్ అయ్యాయి. ఇంత హేళన చేసినా.. సహనం కోల్పోని జడేజా.. డ్రా అనేది తమ చేతుల్లో లేదని చెప్పాడు. ఇద్దరు సెంచరీలు పూర్తి చేసుకున్న అనంతరం భారత్‌కు డ్రాకు అంగీకరించడంతో మ్యాచ్ ముగిసింది. అయితే జడేజాపై కోపంతో బెన్ స్టోక్స్ అతనికి షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. అసహనం వ్యక్తం చేస్తూ షేక్ హ్యాండ్ ఇవ్వకుండా వెళ్లిపోయాడు. బెన్ స్టోక్స్ తీరుపై ఓ జర్నలిస్ట్‌తో మాట్లాడిన అశ్విన్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు.'ద్వంద వైఖరి అనే పదాన్ని ఎప్పుడైనా విన్నారా? ఆ పదం అర్థం కావాలంటే నాలుగో టెస్ట్ ఆఖరి పది నిమిషాల ఆటను చూడాలి. ఇంగ్లండ్‌కు నిరాశ ఎదురైందని, భారత్‌కు అలాంటి ఫిలింగే కలగాలని కోరుకోవడం ఏంటి? హ్యారీ బ్రూక్ బౌలింగ్‌లో సెంచరీ చేస్తావా? అని స్టోక్స్ అన్నాడు. అసలు హ్యారీ బ్రూక్‌తో బౌలింగ్ ఎవడు చేయించమన్నాడు. స్టీవ్ హర్మిసన్, ఆండ్రూ ఫ్లింటాఫ్‌ను తీసుకొచ్చి వేయించు. ఎవరు వద్దన్నారు? హ్యారీ బ్రూక్‌తో బౌలింగ్ చేయించడం మీ తప్పు. భారత్‌ది కాదు.








## ‘కింగ్డమ్’ సెన్సార్ రిపోర్టు.. రన్‌టైమ్ ఎంతంటే?

విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కిన స్పై యాక్షన్ డ్రామా మూవీ ‘కింగ్డమ్’. ఈ నెల 31న విడుదల కానున్న ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు తాజాగా పూర్తయ్యాయి. యూ/ఏ సర్టిఫికెట్ పొందిన ఈ మూవీ రన్‌టైమ్ 160 నిమిషాలు (2.40 గంటలు). సెన్సార్ బోర్డు సూచనల మేరకు చిత్ర బృందం ఆరు చోట్ల మార్పులు చేసింది. ఒక డైలాగ్‌ను మ్యూట్ చేయడం, ఓ అసభ్యకర పదాన్ని తొలగించడం, వయలెన్స్ ఎక్కువగా ఉన్న సన్నివేశాలను సీజీతో కవర్ చేయడం వంటి మార్పులు చోటు చేసుకున్నాయి. మరోవైపు, చిత్ర బృందం విజ్ఞప్తి మేరకు.. టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. సినిమా విడుదల రోజు నుంచి పది రోజుల పాటు ధరల పెంపునకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్స్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌ల్లో రూ.75 (జీఎస్టీతో కలిపి) పెంచుకునేందుకు వీలు కల్పించింది. సినిమా విడుదల సమయం సమీపిస్తుండటంతో విజయ్ ప్రచారంలో పాల్గొని, అభిమానుల్లో జోష్ నింపుతున్నారు. హైదరాబాద్‌లోని సారథి స్టూడియోస్‌కు సోమవారం తరలివచ్చిన ఫ్యాన్స్‌ను ఆయన కలిసి, ఫొటోలు దిగారు. ఫొటోషూట్ అనంతరం తమకు విజయ్ భోజనం ఏర్పాటు చేశారంటూ కొందరు సోషల్ మీడియా వేదికగా ఆనందాన్ని పంచుకున్నారు. మరోవైపు, యూసఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ ఏర్పాటు చేసింది.

### సంగీత దర్శకుడు ఇళయ రాజాకు

## సుప్రీంలో నిరాశ

### పిటిషన్ ను తోసిపుచ్చిన ధర్మాసనం



ప్రముఖ సంజిత దర్శకుడు ఇళయరాజాకు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తన 500కి పైగా పాటలకు సంబంధించిన కాపీరైట్ వివాదాన్ని బాంబే హైకోర్టు నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ ఇళయరాజా సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇప్పటికే ఈ కేసుపై బాంబే హైకోర్టు విచారణ ప్రారంభించిన తర్వాత మద్రాసు హైకోర్టుకు ఎలా బదిలీ చేస్తారని.. సోనీ మ్యూజిక్ ఎంటర్‌టైన్‌మెంట్ తరపు న్యాయవాది సుప్రీంలో ప్రశ్నలు లేవనెత్తారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం సుప్రీం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. ఎకో, ఏఐజీ మ్యూజిక్ కంపెనీలు ఇళయరాజా స్వరపరిచిన పలు పాటలను ఉపయోగించుకునేలా గతంలో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే కాపీరైట్ గడువు ముగిసినా, తన పాటలను ఇంకా వాడుకుంటున్నారంటూ ఎకో, ఏఐజీ మ్యూజిక్ కంపెనీలపై సంజిత దర్శకుడు ఇళయరాజా 2014లో మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అప్పట్లో ఈ పిటిషన్‌పై విచారించిన మద్రాసు హైకోర్టు, నిర్మాతల నుంచి హక్కులు పొందిన తర్వాత ఇళయ రాజా పాటలను వినియోగించుకొనే హక్కు సంజిత సంస్థలకు ఉంటుందని, ఇళయరాజాకు కూడా వ్యక్తిగతంగా హక్కు ఉంటుందని 2019లో ఉత్తర్వులు జారీ చేసింది. ఇళయరాజా పాటలను ఉపయోగించకుండా ఆ మ్యూజిక్ కంపెనీలపై మధ్యంతర నిషేధం విధించింది. సంజితం అందించినందుకు ఇళయరాజాకు నిర్మాత డబ్బులు చెల్లించారని, అందుకే హక్కులు నిర్మాతకే దక్కుతాయని తెలిపింది. మద్రాసు హైకోర్టులో ఆ కేసుపై దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో 2022లో సోనీ మ్యూజిక్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇళయరాజా మ్యూజిక్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన 536 పాటలను వినియోగించకుండా బాంబే హైకోర్టును ఆశ్రయించడంతో ఈ కాపీరైట్ వివాదం మొదలైంది. ఈ పాటలపై హక్కులు, ఎకో రికార్డింగ్ తమ పరిధిలో ఉన్నాయని సోనీ వాదించింది. అయితే ఇళయరాజా కంపోజ్ చేసిన 536 పాటల్లో పలు పాటలకు సంబంధించిన కేసు అప్పటికే మద్రాసు హైకోర్టులో నడుస్తుండడంతో ఈ కేసును మద్రాసు హైకోర్టుకు బదిలీ చేయాలని ఇళయరాజా సుప్రీంను ఆశ్రయించారు.

## మాస్ ఎమోషనల్ డ్రామాగా పెద్ది



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్నతాజా చిత్రం 'పెద్ది' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆర్ఆర్ఆర్ తర్వాత 'గేమ్ ఛేంజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చరణ్ ఈ చిత్రంతో నిరాశపరిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఫెయిల్యూర్‌ను మరిచిపోయేలా, ఓ మాస్ ఎమోషనల్ డ్రామాతో వస్తున్నాడు చరణ్. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కోసం మరో డెప్త్ ఉన్న క్యారెక్టర్ డిజైన్ చేసిన దర్శకుడు బుచ్చిబాబు పెద్ది సినిమాను స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిస్తున్నారు. క్రికెట్, కబడ్డీ, కుస్తీ వంటి స్థానిక ఆటల నేపథ్యంలో సినిమా సాగనుందని సమాచారం. చరణ్ ఇందులో 'ఆట కూలీ' పాత్రలో కనిపించనున్నట్టు టాక్. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. చరణ్ గెటప్ కూడా మరీ డిఫరెంట్‌గా ఉండటంతో సినిమాపై ఆసక్తి పెరిగింది. ఈ సినిమాకు మ్యూజిక్ మాస్ట్రో ఏఆర్ రెహమాన్ సంజితం అందిస్తున్నారు. ఇటీవల రామ్ చరణ్ న్యూ బల్కీ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా నుంచి ఫస్ట్ సాంగ్‌ను ఆగస్టు 25, 2025, వినాయక చవితి సందర్భంగా విడుదల చేయనున్నారట. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. గ్లింప్స్ మూవీపై అంచనాలు పీక్స్‌కి తీసుకెళ్లగా, ఇప్పుడు ఏఆర్ రెహమాన్ సంజిత సారధ్యంలో రూపొందుతున్న సాంగ్స్ అభిమానులకి పూనకాలు తెప్పించడం గ్యారెంటీ– అంటున్నారు. పెద్ది’ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సినిమా స్కేల్, టెక్నికల్ టీమ్, నటీనటుల ఎంపిక అన్నీ చూస్తే ఇది రామ్ చరణ్ కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలవబోతుందని అభిమానులు నమ్ముతున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. ఇటీవల రామ్ చరణ్ జిమ్ లుక్ ఒకటి వైరల్ కాగా, అది చూసిన ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయారు. అచ్చం హాలీవుడ్ హీరోలా ఉన్నాడంటూ కామెంట్స్ చేశారు.

### హిరణ్యకశిపుడిగా

## రానా/మోహన్‌లాల్

### ‘మహావతార్ నరసింహ’ డైరెక్టర్




మన పురాణాలను తెరపై చూసేందుకు ప్రేక్షకులు ఎంతో ఆసక్తి చూపిస్తారన్నది ‘మహావతార్ నరసింహ’ చిత్రంతో మరోసారి రుజువైంది. ఈ నెల 25న విడుదలైన ఈ యానిమేషన్ మూవీ అంతటా మంచి ఆదరణ దక్కించుకుంది. ఈ విజయోత్సాహంలో దర్శకుడు అశ్విన్‌కుమార్ జాతీయ మీడియాతో మాట్లాడారు. ఒకవేళ యామినేషన్ కాకుండా నటులతోనే ఈ సినిమాని తీయాల్సి వచ్చినా.. నరసింహస్వామిని మాత్రం డిజిటల్ రూపంలోనే చూపించేవాడినని తెలిపారు. హిరణ్యకశిపుడిగా రానా, మోహన్‌లాల్, విజయ్ సేతుపతిలో ఎవరో ఒకరిని ఎంపిక చేసేవాడినని అన్నారు. ఆ పాత్రకు ముగ్గురూ పర్‌ఫెక్ట్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు. యానిమేటెడ్ మూవీగా ఎందుకు తెరకెక్కించారన్న ప్రశ్నకు సమాధానామిస్తూ.. “ఈ సినిమా పూర్తవడానికి నాలుగున్నరేళ్లు పట్టింది. ఒక్క ప్రాజెక్టు కోసం ఏ నటుడైనా అంత సమయం కేటాయిస్తారనుకోవడం నమ్మశక్యం కాదు. ముఖ్యంగా నాలాంటి కొత్త దర్శకుడి విషయంలో అది కష్టం. అందుకే డిజిటల్ టూల్స్‌తోనే ఆయా పాత్రలను సృష్టించాం” అని వివరించారు. మహా విష్ణువు దశావతారాల ఆధారంగా వరుస చిత్రాలు రానున్నాయి. అలా ‘మహావతార్ సినిమాటిక్ యూనివర్స్’లో తెరకెక్కిన తొలి సినిమా ఇది. ‘కేజీయఫ్’, ‘కాంతార’, ‘సలార్’లాంటి హిట్ సినిమాల నిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. యానిమేషన్ మూవీ కావడంతో పెద్దగా ప్రచారం లేకపోయినా.. మౌత్‌టాక్‌తోనే రోజురోజుకూ కలెక్షన్స్ పెంచుకుంటూ వెళుతోంది. ఆదివారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా రూ.11.25 కోట్లు (గ్రాస్) వసూలు చేసిందని మేకర్స్ ప్రకటించారు. ఈ నెల 31న చిత్రాన్ని విదేశాల్లో విడుదల చేయనున్నట్టు తెలిపారు. హిరణ్యకశిపుడికి, నరసింహుడికి మధ్య జరిగే యుద్ధం, నేపథ్య సంజితం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

### ఆ అభిమాని ఇచ్చిన రూ.72 కోట్ల ఆస్తిని..

## వారి కుటుంబానికే ఇచ్చేశా

### సంజయ్‌దత్



తనకు గతంలో ఓ అభిమాని ఇచ్చిన రూ.72 కోట్ల ఆస్తిని తాను తిరిగి వారి కుటుంబానికే ఇచ్చివేసినట్లు బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. 2018లో వార్తల్లో నిలిచిన ఈ విషయం గురించి ఆయన మాట్లాడారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోన్న నిషా పాటిల్ అనే అభిమాని అప్పట్లో తన ఎస్టేట్ మొత్తాన్ని సంజయ్ దత్ పేరిట రాశారు. ఆమె తన తదనం తరం సంపదనంతా సంజయ్‌కు బదిలీ చేయాలని బ్యాంకుకు కూడా సూచించినట్లు సమాచారం. అయితే సంజయ్ దత్ ఈ విషయం మీద క్లారిటీ ఇచ్చారు. ‘నేను ఆ ఆస్తిని ఆమె కుటుంబ సభ్యులకే ఇచ్చేశా’ అని తేల్చి చెప్పారు. ఈ సంవత్సరం ప్రారంభంలో విడుదలైన ‘భూత్నీ’, ‘హౌస్‌ఫుల్ 5’ బాలీవుడ్ చిత్రాల్లో సంజయ్ దత్ నటించారు. నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న ‘అఖండ 2’లోనూ ఆయన కనిపించనున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కానుంది.

## అమెజాన్‌లో 8నుంచి అరేబియా కడలి స్ట్రీమింగ్

సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సిరీస్ 'అరేబియా కడలి' ఓటిటి వేదికగా విడుదలవుతోంది. సూర్యకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీకి స్టార్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దీనికి రైటర్‌గా పని చేయడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరించారు. దీంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అమెజాన్‌లో ఆగస్టు 8 నుంచి అందుబాటులోకి రానున్నట్లు– తెలిపింది. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానున్నట్లు– అమెజాన్ ప్రైమ్ తెలిపింది. 'కాలానికి అందరూ సమానమే. అందరూ ఒడుదొడుకులను ఎదుర్కోవాల్సిందే' అంటూ పోస్టర్‌ను పంచుకుంది. రెండు గ్రామాలకు చెందిన కొందరు మత్స్యకారులు అనుకోకుండా బార్డర్ క్రాస్ చేస్తారు. దీంతో వాళ్లను విదేశీ జైల్లో బంధిస్తారు. అక్కడినుంచి వాళ్లు ఎలా బయటకు వచ్చారనే కథాంశంతో ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఇది రూపొందింది. 2024లోనే దీని చిత్రీకరణ ప్రారంభించారు. అయితే ఇటీవల ఇదే కథాంశంతో కొన్ని చిత్రాలు రూపొందినప్పటికీ ఈ కథ ఒరిజినల్ అని సంస్థ పేర్కొంది. ఇందులో సత్యదేవ్ సరసన ఆనంది నటించారు.





### ‘హరిహర వీరమల్లు’ నుంచి


## కొన్ని సన్నివేశాలు తొలగింపు

దాదాపు అయిదేళ్ల చిత్రీకరణ తర్వాత.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన.. ‘హరిహర వీరమల్లు’ భారీ అంచనాల మధ్య జులై 24న థియేటర్లలో విడుదలైంది. అయితే ఈ సినిమాలో కొన్ని సన్నివేశాల్లో వీఎఫ్ఎక్స్ సరిగా లేవని సోషల్ మీడియా వేదికగా చర్చ జరుగుతోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఆ చిత్ర బృందం అలాంటి కొన్ని సన్నివేశాలను సినిమా నుంచి తొలగించింది. హీరో, అతడి అనుచరులు కొండ అంచున గుర్రాలపై స్వారీ చేసే సీన్‌ను కుదించారు. అలాగే జెండా సన్నివేశాన్ని పూర్తిగా తొలగించారు. పవన్ బాణాలు సంధించే యాక్షన్ సీన్‌లో చిన్నచిన్న మార్పులు చేశారు. క్లైమాక్స్ నిడివి కూడా బాగా తగ్గింది. ఇలా మొత్తంగా 10 నుంచి 15 నిమిషాల ఫుటేజీని సినిమా నుంచి తొలగించారు. ప్రస్తుతం థియేటర్లలో ఈ సవరించిన వెర్షనే ప్రదర్శితమవుతోంది. అయితే ఈ సన్నివేశాల తొలగింపు గురించి చిత్రబృందం ఎలాంటి ప్రకటన చేయలేదు.

## విఎఫెక్స్ పనుల్లో విశ్వంభర

### సెప్టెంబర్‌కు విడుదల అనుమానమే?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ దర్శకుడు వసిష్ఠ మల్లిడి డైరెక్షన్ లో వస్తున్ సోషియో ఫాంటాషి సినిమా 'విశ్వంభర'. చిరు సరసన కోలీవుడ్ స్టార్ బ్యూటీ– త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. వంశి ప్రమోద్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. అనుకోని కారణాల వలన షూటింగ్ డిలే అవుతూ వస్తున్న ఈ సినిమా స్పెషల్ సాంగ్ షూటింగ్ ను ఇటీవల ఫినిష్ చేసారు. మౌని రేయ్ చిరు సరసన స్టెప్పులేస్తోంది. దాంతో షూటింగ్ మొత్తం పూర్తిఅయింది. ఎప్పుడో విడుదల కావాల్సిన విశ్వంభర విఎఫెక్స్ వర్క్ కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. విశ్వంభర రిలీజ్ కు వచ్చిన నెగిటివ్ కామెంట్స్ ను దృష్టిలో పెట్టుకుని రీ వర్క్ చేస్తున్నారు. దాదాపు రూ. 75 కోట్లు– విఎఫెక్స్ కోసం ఖర్చు పెడుతోంది. ఇదిలా ఉండగా విఎఫెక్స్ వర్క్ ఆగస్టు చివరి నాటికి ఫినిష్ అవుతుందని సెప్టెంబర్ 25 న విశ్వంభర రిలీజ్ అని టాలీవుడ్ లో వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ ఇప్పటికే అదే డేట్ కు బాలయ్య –బోయపాటిల అఖండ 2, పవర్ స్టార్ క్షప రెడీ గా ఉన్నాయి. దాంతో ఆ రెండు సినిమాలతో పోటీ– ఎందుకు అందుకున్నారో ఏమో విశ్వంభరను మరోసారి వాయిదా వేసేందుకు రెడీ అయ్యారు. విశ్వంభర సెప్టెంబర్ రేస్ నుండి తప్పుకుని డిసెంబరుకు వెళ్తోంది. రాజాసాబ్ సంక్రాంతికి వెళ్లే అవకాశం ఉంది.



## మెగాస్టార్ తో స్టెప్పులేసిన మౌని రాయ్



మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో వస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం ‘విశ్వంభర’ షూటింగ్ పూర్తయింది. దర్శకుడు వశిష్ట ఈ చిత్రాన్ని కియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్‌లతో కలిసి ఎపిక్ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. చిత్ర బృందం తెలిపిన వివరాల ప్రకారం, చిరంజీవి –మౌని రాయ్‌లపై చిత్రీకరించిన భారీ డ్యాన్స్ నెంబర్‌తో సినిమా షూటింగ్ పూర్తి అయింది. ఈ హై ఎనర్జీ సాంగ్‌కు భీమ్స్ సిసిరోలియో సంజితం అందించగా, శ్యామ్ కాసర్ల సాహిత్యం రాశారు.

RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644. Web: shenarthimedia.in, Epaper:epaper.shenarthimedia.in